ప్రజాశక్తి
సోమవారం 26 ఆగస్టు 2024



పర్యాటక ప్రాంతాలు కిటకిట

ప్రజాశక్తి- అనంతగిరి:ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు ఆదివారం కిటకిటలాడాయి. ఆదివారం సెలవు దినం కావడంతో విదేశీ, ఇతర ప్రాంతాలకు చెందిన వేలాది మంది పర్యాటకులు సందర్శించారు. దీంతో ఆ ప్రాంతమంతా జనాలతో కిటకటలాడింది. తాడిగుడ, చిటంపాడు, కటికి జలపాతాలు తిలకించారు. కుటుంబ సమేతంగా స్నానాలు చేసి కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు.అలాగే డమ్ముకు, సుంకరమెట, యూ పాయింట్, అనంతగిరి, బీసుపురం, సుంకరమెట్ట, కాఫీ ప్లాంటేషన్‌ను పర్యాటకులు సందర్శించారు. కాఫీ ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేశారు.అరకు, డుంబ్రిగూడ ప్రాంతాలను తిలకించారు.



బొర్రా గుహల వద్ద పర్యాటకులు

రైస్ మిల్లులో విద్యా బోధన!

- నత్తనడకన నూనత భవన నిర్మాణ పనులు - అవస్థలు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -హుకుంపేట:ఏజెన్సీ ప్రాంతంలో పాఠశాల భవనాలు లేక నేటికీ వరండా, పూరింట్లో, పూరి గుడిసె, రేకుల షెడ్డుల్లో విద్యాబోధన కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో, విద్యార్థుల బాధలు వర్ణణాతీతం.ఎన్ని ప్రభుత్వాలు మారినప్పటికీ విద్యా విధానంలో మార్పు రాలేదు. దీంతో విద్యార్థులు వర్షాలకు తడుస్తూ. .ఎండలకు ఎండుతూ చదువులు సాగించాల్సిన పరిస్థితి తలెత్తింది. మండలంలోని ఓ పాఠశాల దుస్థితిపై ప్రత్యేక కథనం..

మండలంలోని ఓల్డ పంచాయతీ పెట్రాయి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల మంజూరైనప్పటి నుంచి దాదాపు 15 సంవత్సరాల పైబడి నుంచే సొంత భవనం లేదు. దీంతో, విద్యార్థుల చదువుకోవడానికి అవస్థ పడుతున్నారు. పెట్రాయి ఎంపీపీఎస్ పాఠశాలలో 21 మంది విద్యార్థులు విద్యభ్యసిస్తున్నారు. నేటికీ పాఠశాలకు సొంత భవనం లేక రైస్ మిల్లు ఉన్న రేకుల షెడ్‌లో తాత్కాలికంగా విద్యా బోధనలు నిర్వహిస్తున్నారు. ముందు వరండాలో కొన్ని సంవత్సరాలు విద్యాభ్యాసం నిర్వహిస్తుండేవారు. ఆ తర్వాత కొన్ని సందర్భాల్లో వీలు లేక అక్కడ నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు కలిసి ఒక పూరి గుడిసె ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అక్కడ నాలుగు సంవత్సరాలు పాటు విద్యాభ్యాసాలు కొనసాగింది. నాలుగేళ్ల



పునాది దశలో నిలిచిన భవనం పనులు



రైస్ మిల్లులో చదువుతున్న విద్యార్థులు

గడిచిన తర్వాత పూరి గుడిసె గడ్డి కాస్త పాడై వర్షానికి కారుతుండటంతో తాత్కాలికంగా విద్యాబోధనకు కొనసాగించేందుకు విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కలిసి ఆ గ్రామంలోని రైస్ మిల్లు యజమానితో మాట్లాడి ప్రస్తుతం విద్యాభ్యాసం కొనసాగుతోంది.

ఇన్ని అవస్థలు పడుతున్నా ప్రభుత్వ అధికారులకు ఆ పాఠశాల గోడు పట్టక పోవడం విశేషం. గ్రామంలో పాఠశాల మంజూరై నేటికీ సుమారు 15 సంవత్సరాలు గడుస్తున్నా సొంత భవనం లేక విద్యార్థులు ఎన్నో అవస్థలు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.. విద్యార్థులు రైలు మిల్లులోనే కూర్చొని పాఠాలు వింటున్నారని, దీంతో విద్యా వ్యవస్థ కుంటుపడుతుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు పాడవకుండా ఉండేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ మాట్లాడుకొని వారి కష్టాలు కాస్త ఓ యజమాని రైస్ మిల్లు యజమానితో మాట్లాడి ఒప్పించారు. రేకు షెడ్డులోనే తాత్కాలికంగా పాఠశాలను నేటికీ కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వం పాఠశాల భవనం మంజూరు చేసినప్పటికీ నేటికీ ప్రారంభ దశలోనే పనులు సాగుతున్నాయి. నిధులు విడుదల చేయక పోవడంతో పనులు చేపట్ట లేదు. పాఠశాల భవన నిర్మాణం చేపట్టి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



రైస్ మిల్లు ఇదే..

వర్షంతో వారపుసంత వెలవెల



వర్షం కురుస్తుండడంతో వెలవెలబోయిన సీలేరు సంత

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం వారపుసంతకు వర్షంతో వ్యాపారుల విక్రయాలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఆదివారం ఉదయం నుంచి భగ్గుమన్న సూర్యుడు, సాయంత్రం నాలుగు గంటల సమయంలో వాతావరణం లో మార్పులు చోటుచేసుకుని వర్షం కురవడంతో వారపుసంతలో చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మారుమూల గ్రామాల నుంచి నిత్యవసర సరుకులు కొనుగోలు చేయడానికి వారపు సంతకు వచ్చిన గిరిజనులు తిరిగి వారి ఇళ్లకు వెళ్లేందుకు వర్షంతో ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. కొంత సమయం తర్వాత వర్షం నిలిచిపోయినప్పటికీ, తర్వాత వారపు సంతలో వ్యాపారాలు యధాతధంగా సాగలేదు. వారపు సంతకు బెండకాయలు బీరకాయలు చిక్కుళ్ళు కాలిఫ్లవర్ బీన్స్ తదితర కూరగాయలను తీసుకొచ్చిన గిరిజన రైతులు అవి పూర్తిస్థాయిలో అమ్ముడుపోక అవస్థలు పడ్డారు. . కొంతమంది గిరిజన వ్యాపారులు చింతపల్లి సమీపంలో ఉన్న చౌడుపల్లి వద్ద గిరిజనులు పండిస్తున్న కూరగాయలు కొనుగోలు చేసి సీలేరు సంతకు విక్రయానికి తీసుకొచ్చారు. ు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గ్రామాల నుంచి ఒకేసారి పెద్దఎత్తున చిరువ్యాపారులు, గిరిజన రైతులు పెద్దఎత్తున కూరగాయలు తీసుకురాగా, వర్షంతో వారపుసంత నిర్వహణకు ఇబ్బంది ఏర్పడడంతో అవి పూర్తిస్థాయిలో అమ్ముడుపోక చిరు వ్యాపారులు నిరాశకు గురయ్యారు. అయితే వారపుసంతకు తెచ్చిన కూరగాయల ధరలు కూడా ఎక్కువగా ఉండడంతో దినసరి కూలీలు ఇబ్బందులు పడ్డారు. ఉల్లిపాయలు కిలో రూ.60, కాలిఫ్లవర్ రూ.100, బీన్స్ రూ.80, టమాటా రూ.40 పచ్చిమిర్చి రూ.100 ధర పలకడంతో గిరిజనులు కొనేందుకు వెనకడుగు వేశారు. సాయంత్రం ఆరు గంటలకు సంత ముగిసే సమయంలో మరోమారు భారీ వర్షం కురవడంతో కూరగాయలు, ఇతర సరుకులు వర్షంలో తడిసి ముద్దయ్యాయి. వారపుసంతకు వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు.

లగేజీ బుకింగ్ సౌకర్యం లేక ఇక్కట్లు

సీలేరులో ఆర్‌టిసి ఎంఆర్ సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు వచ్చే ఆర్‌టిసి బస్సులకు ఎంఆర్ సౌకర్యం కల్పించాలని వ్యాపారులు వినియోగదారులు కోరుతున్నారు. అత్యవసర సమయంలో విశాఖపట్నం నర్సీపట్నం వయా సీలేరు నైట్ హాల్ట్, విశాఖ వయా నర్సీపట్నం సీలేరు, భద్రాచలం వెళ్లే నైట్ బస్సు సర్వీసులతో పాటు పగటి పుట నడిపే బస్ సర్వీసులకు ఎంఆర్ సౌకర్యం కల్పించకపోవడంతో అనేక ఇబ్బందులుకు గురవుతున్నారు. విశాఖపట్నం నుంచి భద్రాచలం వరకు ఎంఆర్ సౌకర్యం ఉంది. అత్యవసర సమయంలో దారకొండ, దుప్పిలివాడ, సీలేరు చెందిన వ్యాపారులు విశాఖపట్నం నుంచి భద్రాచలం వరకు అధిక చార్జీలతో ఎమ్మార్ చేయించుకుని, ఆయా గ్రామాల్లో సామాన్లు దించుకోవలసిన పరిస్థితి నెలకొందని వాపోయారు. విశాఖపట్నం టు సీలేరు ఆర్‌టిసి బస్సులకు ఎమ్మార్ సౌకర్యం కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని అంటున్నారు. ఒకవేళ అత్యవసర సమయంలో మందులు, ఇతర వస్తువులు డ్రైవర్, కండక్టర్‌కు ఇస్తే, తనిఖీ సమయంలో ఆర్‌టిసి స్క్వాడ్ తమపై కేసులు రాస్తున్నారని భయపడుతూ, వారు తీసుకోవడం లేదని, దీంతో సీలేరుకు ఎటువంటి సరుకులు అవసరమైతే ఎవరో ఒకరు వెళ్లి తెచ్చుకోవడమే తప్ప ప్రత్యామ్నాయం లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భద్రాచలం అడ్రస్‌కు సీలేరుకు ఆర్‌టిసి కార్గోలో బుక్ చేసిన వస్తువులు

ఎపిఎస్ఆర్‌టిసి లాజిస్టిక్‌లో ఎమ్మార్ బుక్ చేసి, లగేజ్ పంపించవలసి ఉంటుందని, అయినా ఆది సీలేరులో తీసుకోవడానికి పడిగాపులు, వేచిచూడడం, చివరకు ఆర్‌టిసి సిబ్బంది దయాదాక్షిణ్యాల మీదే అది అందే పరిస్థితి ఉందని అంటున్నారు. ఇటీవల సీలేరులో మరమ్మతుకు గురైన బైక్‌కు రెండు బోల్ట్‌లు కోసం విశాఖ నుంచి సీలేరు తెచ్చేందుకు భద్రాచలం వరకు ఆర్‌టిసి బస్‌కు ఎంఆర్ కొట్టించి తెచ్చే ప్రయత్నం చేసినా, సీలేరులో బస్సు అపకుండా వెళ్లిపోవడంతో అది అందలేదని జయరాజ అనే యువకుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఎందరో ప్రతిచిన్న అవసరానికి ఇతరులపై ఆధారపడడంతో, వ్యయప్రయాసలు పడుతూ, సమయాన్ని అదనంగా వెచ్చించి తెచ్చుకోక తప్పడం లేదని అంటున్నారు ఇప్పటికైనా ఆర్‌టిసి యంత్రాంగం స్పందించి సీలేరులోనూ ఎంఆర్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా ఉన్న బోనూరు, చీడిమెట్టు రోడ్డు

ప్రమాదభరితంగా రహదారులు

-మధ్యలోనే నిలిచిన పనులు - వర్షాలకు దెబ్బతిన్న వైనం -రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-అనంతగిరి:మారుమూల గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ లోపంతో ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు. పనుల నిర్మాణపు దశలోనే వర్షాలకు కోతకు గురవుతున్నా పట్టించుకున్న నాథుడే లేడు.

మండలంలోని మారుమూల పెద్దకోట, పిన్నకోట, కివర్ల, పంచాయతీల పరిధి పెదకొట మెయిన్ రోడ్డు నుండి బొర్రాపాలేం, చటకంభ, బోనురు, చీడిమెటు, గడ్డిబంద, జగడలమాడి, పూతికపుటు, టంగెలబంద, గంగవరం గ్రామాలతో పాటు సుమారు 15 గ్రామాలు ఈ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్నాయి. రోడ్డు నిర్మాణానికి ఎంజిఎన్ఆర్ఈజీఎస్ పథకం, ట్రైబల్ వెల్ఫేర్ శాఖలు సుమారు 16 కోట్ల రూపాయల నిదులు మంజూరు చేశాయి. 2019-20 సంవత్సరంలో సంబంధిత అధికారులు రోడ్డు పనులను ప్రారంభించారు. ఫార్మేషన్ రోడ్డు అనంతరం కెసర్‌తో పాటు మెటల్ వేసి రోలింగ్ చేయవలసి ఉంది. ఆ పనులు నేటి వరకు ఏళ్లు గడుస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయలేదు. దీంతో, కురుస్తున్న బారీ వర్షాల కారణంగా నాసిరకంగా ఏర్పాటు చేసిన కల్వర్టు వరద కోతకు గురైంది. అంతేకాకుండా అక్కడక్కడ వేసి వదిలిన కెసర్ బుగ్గి వరద కొట్టుకోకపోయింది.పలుచోట్ల వరద ప్రభావానికి రోడ్డంతా కోతకు గురి కావడంతో, ద్విచక్ర, ఆటో, అంబులెన్స్ వంటి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది,. పనులు జరగకుండానే రికార్డులు సృష్టించి నిధులు డ్రా వేస్తున్నారనె విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై గిరిజనులు సంబంధిత జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ఎక్కడ వేసి గొంగళీ అనట్టుగా నిలిచిపోయిన రోడ్డు పనులు అలాగే ఉన్నాయి. ఇప్పటికైనా రోడ్డు పనులు పూర్తి చేయాలని పలు గ్రామాల గిరిజన ప్రజలు కోరుతున్నారు.



పూటికపుట్టు, చటకంబ రోడ్డు



చీడిమెట్టు రోడ్డులో దెబ్బతిన్న కల్వర్టు

రాజులు మాస్టారు సేవలు స్ఫూర్తిదాయకం



రాజులు మాస్టారు దంపతులను సత్కరిస్తున్న ములకనపల్లి వాసులు

ప్రజాశక్తి- విఆర్.పురం: ములకనపల్లిలో మొట్టమొదటిసారిగా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి, గ్రామస్తులను చదువుతోపాటు అన్నిరంగాల్లో తీర్చిదిద్దిన సున్నం రాజులు మాస్టారు సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ నెల 31న రాజులు మాస్టారు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం ములకలపల్లి పాఠశాలలో సర్పంచ్ సవలం మారయ్య, ఉద్యోగస్తులు, యుటిఎఫ్ నాయకులు, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో సున్నం రాజులు మాస్టర్, వారి సతీమణి సున్నం నాగమ్మను అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా ములకనపల్లిలో ఉద్యోగులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయవీడ్కోలు సభలో రాజులు మాస్టారు ఘనంగా అభినందించి, సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, 1986లో మొదటిసారిగా ములకనపల్లిలో ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించిన రాజులు మాస్టారు, స్ఫూర్తిదాయకమైన సేవలతో గ్రామంలోని విద్యార్థులు, యువతకు అక్షరజ్ఞానం అందించడంతోపాటు,నేడు గ్రామంలోని యువత వ్యవసాయం, ఉద్యోగం, రాజకీయం, ఆర్థిక, సామాజిక రంగాలలో ముందుండేందుకు అవసరమైన నైపుణ్యాన్ని అందించి, మార్గదర్శకులుగా దిశానిర్దేశం చేశారని కొనియాడారు. ప్రస్తుతం సున్నవారిగూడెం హాస్టల్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న రాజులు మాస్టారు. ఈ నెలాఖరును రిటైర్మెంట్ తర్వాత తమ గ్రామానికి అవసరమైన సలహాలు, సూచనలు అందించి చేదోడువాదోడుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ములకనపల్లి గ్రామ సర్పంచ్ సలవం మారయ్య, గ్రామ ఉద్యోగులు పండా రాఘవయ్య, నూనె రామకృష్ణ, నూనె ప్రసాద్, ఆసు రాము, నూనె చిన్న బొజ్జి, నూనె జగదీష్, నూనె చిన్న ప్రసాద్, బొగ్గా నాగయ్య, నూనె సుధారాణి, జల్లి కృష్ణయ్య, నూనె రాజు, కారం రాందాస్, నూనె రాంబాబు, నూనె దూలమ్మ, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంభనకు 'లక్ పతి దీదీ'

● ఆర్థికంగా వెనుకబడిన స్వయంసహాయక సంఘ సభ్యులకు రుణ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - రంపచోడవరం : స్వయంసహాయక మహిళల ఆర్థికాభివృద్ధి, వారిని లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం లక్ పతి దీదీ పథకం ప్రవేశ పెట్టిందని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం అన్నారు. ఆదివారం స్థానిక ఐటిడిఎ సమావేశమందిరంలో ప్రధాని మోడీ మహారాష్ట్ర జల్గావ్‌లో ప్రారంభించిన ఈ పథకం ప్రత్యక్షప్రసారాన్ని చూసి, అనంతరం మహిళలకు రుణాలను చెక్‌లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా పిఒ సింహాచమాట్లాడుతూ ఏజెన్సీలోని 11 మండలాల్లో లక్ పతి దీదీ పథకం ద్వారా లబ్ధిచేకూర్చి, వారిని లక్షాధికారులను చేయలన్న లక్ష్యంగా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ ద్వారా అన్ని గ్రామాల్లో ఆర్థికంగా వెనుకబడిన మహిళలను గుర్తించామన్నారు. ఈ మేరకు 32200 మంది లక్ష్యం కాగా, 24573 మంది మహిళలను ముందుగా గుర్తించామన్నారు. ఈపథకం ద్వారా ప్రతి కుటుంబంలో ఏడాదికి సగటున రూ. లక్ష , అంటే నెలకు కనీసంరూ.పదివేలు ఆదాయం వచ్చే విధంగా వారిని అభివృద్ధి చేయాలన్నదే పథక లక్ష్యమన్నారు..గ్రామీణ ప్రాంతంలో పేదరిక నిర్మూలన, అదేవిధంగా మహిళలను లక్షాధికారిణి చేస్తే వారిపిల్లల చదువులు, ఆరోగ్యం మెరుగుపరిచేందుకు స్వయం సహాయక సంఘాలలో రెండేళ్ల సభ్యులుగాఉన్న నిరుపేద మహిళలను గుర్తించి, వారి సుస్థిరమైన జీవనోపాదులు కల్పించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చేయుట, మానవ అభివృద్ధి, సామాజికంగా వెనుకబడిన నిరుపేద మహిళలను లక్‌పతి దీదీ పథకానికి దత్తత తీసుకోవడం వంటివాటికి గుర్తించిన లబ్ధిదారుల వివరాలు రిజిస్ట్రేషన్, డిజిటిలైజేషన్ చేస్తామన్నారు. ఏజెన్సీలోని నిరుపేద మహిళా సంఘాల సభ్యులకు వ్యవసాయం, గొర్రెలు, ఆవులు, పొట్టేలు, గేదెలు, పందులు, కోళ్ల ఫారాలు, చేపలు రొయ్యలు పెంపకం వంటి జీవనోపాదులకు అవసరమైన నైపుణ్యశిక్షణ, రుణాల మంజూరు, క్రమం తప్పకుండా పర్యవేక్షణతో ఆయారంగాలను అభివృద్ధి చేయడం, మార్కెటింగ్, ఉత్పత్తుల ప్యాకింగ్, నాణ్యమైన ఉత్పత్తుల తయారీతో బ్రాండింగ్, ఆయా పథకాలకు ఇన్సూరెన్స్ కల్పించడం, వంటివాటికి సంబంధిత శాఖలతో అనుసంధానం చేసి, మహిళల ఆర్థికస్వావలంభనకు ఈ పథకంద్వారా సాయం చేయనున్నట్లు వెల్లడించారు. ఏజెన్సీలోని గంజాయి, డ్రగ్స్ వంటివి వృద్ధి చెందకుండా, వాటి బారిన పడి యువత, గిరిజనం తమ జీవితాలను నాశనం చేసుకోకుండా మహిళా సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రంపచోడవరం వెలుగు ఏపీడి ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలంతా సంఘాలుగా ఉంటే వారి ఆర్థికాభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండల వైస్ ఎంపిపి పండ కుమారి, ఎంపిటిసి ఉలవల లక్ష్మి మాట్లాడుతూ అధికవడ్డీతో బయట అప్పులతో మహిళలు ఇబ్బందులు పడకుండా బ్యాంకు రుణాలతో జీవనోపాధి పథకాలను అమలుచేసి అభివృద్ధి చెందే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సిఆర్‌పి సర్వే చేసిన పదిమందికి ప్రాజెక్ట్ అధికారి సింహాచలం సర్టిఫికెట్లు అందజేశారు. తొలివిడతలో 1056 మందికి రూ.6.104కోట్ల శ్రీనిధి చెక్కును, 120 మహిళా సంఘాలకు రూ.6.49కోట్ల బ్యాంకు లింకేజీ, ఆర్ఎల్‌సిఐఎఫ్ ద్వారా వై రామవరం మండలం, మారేడుమిల్లి మండలం మహిళా సంఘాలకు రూ.20 లక్షలు చెక్కును ప్రాజెక్ట్ అధికారి అందజేశారు.కార్యక్రమంలో డిపిఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, ఎపిఎం అప్పారావు మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.



లబ్ధిదారులైన మహిళా సంఘ సభ్యులకు చెక్‌ను అందజేస్తున్న ఐటిడిఎ పిఒ సింహాచలం

మారేడుమిల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్‌పతి పథకం ప్రవేశపెట్టారని ఎపిఎం శ్యాంబాబు అన్నారు. ఆదివారం మండల మహిళా కేంద్రంలో వివిధ మహిళా సంఘాల సమావేశంలో మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా లబ్ధికి గ్రామాల్లో ఆర్థికంగా వెనుకబడిన స్వయంసహాయక మహిళలను కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ గుర్తించామన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి నెలకు కనీసం రూ.పదివేలు ఆదాయంతో ఏడాదికి లక్షకుపైగా ఆదాయం చేకూర్చాలన్నదే లక్ష్యమన్నారు. దీనిపై అవసరమైన శిక్షణ, రుణం, ఇతర నైపుణ్యత ప్రభుత్వపరంగా అందజేస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండ జాకబ్, జెడ్‌పిటిసి గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపిపి లకొండ రవికుమార్, టిడిపి మండల అధ్యక్షులు గురుకు శేషుకుమార్, టిడిపి మాజీ మండల అధ్యక్షులు బిసెట్టి అప్పాజీ టీఎన్ఎస్ఎఫ్ నాయకులు దూడ ప్రణీత్, సిసిలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కారిడార్ నిర్వాసితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులను 2013 భూ సేకరణ చట్ట ప్రకారం అన్ని విధాలుగా ఆదుకున్న తర్వాతే పనులు ప్రారంభించాలని నాయకులు, నిర్వాసితులు డిమాండ్ చేశారు. మండలంలోని మూలపర్ర గ్రామంలో తుఫాన్ భవనంలో ఆదివారం మాజీ సర్పంచ్ భర్త, వైసిపి నాయకులు సూరకాసుల గోవిందు అధ్యక్షతన నిర్వాసితుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహ మూర్తి, చందనాడ సర్పంచ్ భర్త తళ్ళ భార్గవ్,రైతు సంఘం నాయకులు తళ్ళ అప్పలస్వామి తదితర నాయకులు హాజరయ్యారు. నిర్వాసితుల సమస్యలపై చర్చించారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో ప్యాకేజీ, పరిహారం, ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించి, ఇతర సమస్యలు పరిష్కరించే వరకు అధికారులు భూములు జోలికి రావద్దన్నారు. ముందుగా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇల్లులు కోల్పోతున్న వారికి 25 లక్షలు, భూములు తీసుకోవడంతో ఉపాధి కోల్పోతున్న 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి భూములు స్వాధీనం చేసుకునే సంవత్సరాన్ని కటాఫ్ తేదీగా పరిగణించి రూ.15 లక్షల చొప్పున ప్యాకేజీ చెల్లించాలని కోరారు. ఇంకా పలు గ్రామాల్లో డీ పట్టా, సాగుదారుల సమస్యలు కూడా ఉన్నాయని ఆ సమస్యలను కూడా పరిష్కరించి పరిహారం చెల్లించాలన్నారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ గ్రామ సభలకు హాజరై నిర్వాసితులు, వివిధ వృత్తుదారుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటుకు భూములు, ఇల్లులు త్యాగాలు చేసిన నిర్వాసితులను ఇబ్బందులకు గురి చేయకుండా, సమస్యలన్నింటిని పరిష్కరించిన తర్వాతే పనులు చేపట్టాలని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. పార్టీలకతీతంగా నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు గొర్ల బాబురావు, యలమంచిలి తాతబాబు, గంటా నరసింగరావు, మనబాల రాజేష్, వంకా కృష్ణ, సూరిబాబు రాజు, రావి ఈశ్వరరావు, రావి అప్పారావు, పిక్కి రాము, ఎరిపల్లి నాగేష్ ,పెద్ద సంఖ్యలో నిర్వాసితులు పాల్గొన్నారు

ఆగని ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి- కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రవేశ పెట్టినప్పటి నుంచి మండలంలో ఏదో ఒక ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా రవాణా జరుగుతూనే ఉంది. పలుమార్లు పోలీసులు, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి జరిమానా విధించినా అక్రమ ఇసుక రవాణా నిత్య కృత్యంగా మారింది. ఆదివారం తెల్లవారు జామున రాజుపేట గ్రామం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను స్థానిక పోలీసులు పట్టుకొని స్టేషన్కు తరలించారు. శనివారం పట్టుబడ్డ రెండు ట్రాక్టర్లకు, ఆదివారం పట్టుబడ్డ ట్రాక్టర్కు సోమవారం జరిమానా విధిస్తానని స్థానిక ఎస్సై రమణయ్య తెలిపారు.

ప్రధానంగా టైరు బళ్ళు నుండి ట్రాక్టర్లకు డంపింగ్ చేయడంతో రెవెన్యూ, పోలీసు అధికారులకు తలనొప్పిగా తయారైంది. ట్రాక్టర్ల ద్వారా చేస్తున్న ఇసుక రవాణా రాజకీయ నాయకుల అండదండలతోనే నడుస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి, నది నుంచి తరలిస్తున్న ఇసుక కారణంగా స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట పొలాలకు సమీపంలో ఇసుకను తరలించుకుపోవడంతో సమీపంలోనే బోరు బావులు ఉండటంతో భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.అధికారులు అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

పెన్సిల్‌పై బాలకృష్ణుడు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత, సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేష్ తన సూక్ష్మ కళతో పెన్సిల్ మొనపై బాల మురళీకృష్ణుని రూపం అద్భుతంగా తీర్చిదిద్దాడు. సోమవారం శ్రీ కృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకొని చార్‌కోల్ పెన్సిల్ మొనపై 8 మి.మీ. పొడవు, 14 మి.మీ. వెడల్పుతో కృష్ణుని ప్రతి రూపాన్ని చెక్కి అందరిని అబ్బురపరిచాడు. ఇందుకోసం 5 గంటల సమయం పట్టిందని వెంకటేష్ తెలిపాడు. ప్రస్తుతం ఆయన ఉన్నత విద్యను అభ్యసిస్తూ యూఎస్‌లో ఉంటున్నారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ

ప్రజాశక్తి - చీడికాడ: మండల కేంద్రంలో ఆదివారం గ్రామదేవత మోదకొండమ్మ తల్లి అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. నాయకులు, భక్తులు ఘటాలను ఊరేగించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, తెలుగుదేశం నాయకులు పైలా ప్రసాదరావు, మాజీ జెడ్పిటిసి పోతల రమణమ్మ, అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మరో ఆరుగురు విద్యార్థుల డిశ్చార్జ్

ఒక్కొక్కరికీ రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేత


చెక్కు అందజేస్తున్న జెసి, పిఒ

ప్రజాశక్తి -పాడేరు: ఇటీవల విద్యార్థులు తీసుకున్న ఆహారం విషతుల్యమై అస్వస్థతకు గురి కావడంతో ఆసుపత్రుల్లో చేరి వైద్య చికిత్సలు పొందుతున్న మరో ఆరుగురు పూర్తిగా కోలుకోవడంతో ఆదివారం డిశ్చార్జ్ చేశారు. ఈనెల 17వ తేదీన అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామంలో ఒక అనాథ ఆశ్రమంలో తీసుకున్న ఆహారం కలుషితం కావడంతో ముగ్గురు విద్యార్థులు చనిపోయిన విషయం తెలిసిందే. మిగిలిన విద్యార్థులందరూ వివిధ ఆస్పత్రుల్లో జాయిన్ అయ్యారు.మృతి చెందిన విద్యార్థుల కుటుంబీకులకు ఒక్కొక్కరికి 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియ అందించారు. అదేవిధంగా, తీవ్ర సమస్య ఎదుర్కొంటున్న 44 మందికి ప్రభుత్వం యాభై వేల రూపాయలు చొప్పున ఆర్థిక పరిహారాన్ని అందజేసింది. అందులో భాగంగా కేజీహెచ్ నుండి చికిత్స పొందుతున్న ఆరుగురు విద్యార్థులను డిశ్చార్జ్ చేసి పాడేరు డిజిహెచ్‌లో చేర్పించారు. వారి ఆరోగ్యం పూర్తిగా కుదుటపడినందున ఆదివారం సంయుక్త కలెక్టర్ డాక్టర్ ఎంజె అభిషేక్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి,అభిషేక్ జిల్లా ఆసుపత్రిని సందర్శించి బాధిత విద్యార్థులను పరామర్శించారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేశారు. అనంతరం ఆరుగురు బాధిత విద్యార్థుల కుటుంబీకులకు ఒక్కొక్కరికి 50 వేల రూపాయలు చొప్పున చెక్కులను, 25 కేజీల చొప్పున బియ్యం, పౌష్టికాహారం కిట్లను జెసి, పిఒ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జెసి, పిఒ మాట్లాడుతూ, విద్యార్థులను ప్రభుత్వ వసతి గృహాల మాత్రమే చేర్పించాలని సూచించారు. అనుమతి లేని అనధికార వసతి గృహాల్లో చేర్పించవద్దని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయా విద్యార్థులను దగ్గరలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ.కొండలరావును పిఒ ఆదేశించారు. చింతపల్లి, జీకే వీధి మండలాలకు చెందిన ఆరుగురు విద్యార్థులను వారి స్వగ్రామాలకు అంబులెన్స్‌లో తరలించాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. మెడికవర్‌లో చికిత్స పొందుతున్న మరో ముగ్గురు విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడినందన వారిని పాడేరు జిజిహెచ్‌కు తీసుకువచ్చారు. వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి డిశ్చార్జ్ చేస్తామని జెసి డాక్టర్ అభిషేక్ తెలిపారు.ఆదివారం డిశ్చార్జ్ అయిన ఆరుగురు విద్యార్థుల వివరాలు...కిల్లో జ్యోతి, మర్రి మీనాక్షి, మర్రి కుమారి, బురడ అబ్రహం, పాంగి మౌనిక, పాంగి మీరా ఉన్నారు. వారిని రెండు అంబులెన్స్‌లలో స్వస్థలాలకు పంపించారు.

ఆసుపత్రి సిబ్బంది వేతనాల చెల్లింపునకు సిద్ధం

- జిల్లా ట్రెజరీ అధికారి ప్రసాద్ బాబు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు సర్వజన ఆసుపత్రిలో గత ఐదు నెలలుగా జీతాలు లేకుండా ఇబ్బంది పడుతున్న సిబ్బంది సమస్య కొలిక్కి వచ్చింది. గత ఐదారు నెలలుగా జీతాలు లేకుండా విధులు నిర్వహిస్తున్న జిజిహెచ్ సిబ్బంది శనివారం ఆసుపత్రి ఎదుట ధర్నా చేయడమే కాకుండా, ఒక నర్సింగ్ సిబ్బంది ఆత్మహత్యకు ప్రయత్నించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ వెంటనే స్పందించి, వైద్య విద్య రాష్ట్ర సంచాలకులు, ఖజానా శాఖ రాష్ట్ర సంచాలకులు, ఇతర ఉన్నతాధికారులతో చర్చించారు. తగు ఆదేశాలు జారీ చేయించడంతో సమస్య ఒక కొలిక్కి వచ్చింది. ఈ నేపథ్యంలో ఏడుగురు రెగ్యులర్ సిబ్బందితో పాటు 49 మంది కాంట్రాక్ట్ సిబ్బందికి జీతాల బిల్లులు జిల్లా ట్రెజరీ కార్యాలయానికి సమర్పించగా జిల్లా ఖజానాధికారి ఆర్ ప్రసాద్ బాబు వెంటనే స్పందించి ఐదు నెలల బిల్లులను ఒకేసారి ఆమోదింప చేశారు. దీంతో, ఈ 56 మందికి మిగిలిన అన్ని శాఖల మాదిరిగా సెప్టెంబర్ ఒకటవ తేదీన ఐదు నెలల జీతాలు వారి వారి ఖాతాలకు జమవుతాయి. జిజిహెచ్ లో ఔట్సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న మరో 39 మంది సిబ్బంది జీతాల బిల్లులను ఆసుపత్రి అధికారులు సమర్పించాల్సి ఉందని, ఆ బిల్లులు కూడా సమర్పించిన వెంటనే ఆమోదించడం జరుగుతుందని జిల్లా ఖజానాధికారి ప్రసాద్ బాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిజిహెచ్ రెగ్యులర్ సిబ్బంది, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బంది జిల్లా కలెక్టర్ కు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి, ఆసుపత్రి మెడికల్ పర్యవేక్షకులకు జిల్లా ఖజానాధికారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

గెజిటెడ్ హెచ్‌ఎంల కార్యవర్గం ఏర్పాటు

అధ్యక్ష, కార్యదర్శులుగా జివివి ప్రసాద్, నాగేశ్వరరావు


జివివి.ప్రసాద్


నాగేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన సంక్షేమ శాఖ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం స్థానిక తలారి సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విజయనగరం, అనకాపల్లి జిల్లాల గిరిజన సంక్షేమ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు కర్రీ సూర్యనారాయణ, బావ రాజు అప్పారావు పర్యవేక్షణలో ఏకగ్రీవంగా నూతన కమిటీ ఏర్పడింది. నూతన గౌరవ అధ్యక్షులుగా ఎస్.పూర్ణచంద్రరావు, అధ్యక్షులుగా జీవివి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా టీ.నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామరాజు పడాలి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.ప్రసాద్‌రావు, మహిళా అధ్యక్షురాలిగా కే.సుమిత్ర, కోశాధికారులుగా పి.పండన్న, ఎం. బాలరాజు నియమితులయ్యారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బోని గ్రామ సర్పంచ్ బోని అప్పలకొండ అన్నయ్య కరకాన శ్రీనివాసరావు (34) విజయనగరం నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. చిన్నాపురం జంక్షన్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం వేగంగా వస్తూ శనివారం రాత్రి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.

బోని గ్రామానికి చెందిన కరకాన సీతారాం, రమణమ్మల కుమారుడు శ్రీనివాసరావు ఇటీవలే ఐసిఐసిఐ బ్యాంకులో ఉద్యోగం సంపాదించాడు. శ్రీను స్వతహాగా మృధు స్వభావి. స్వంతనిరంకారీ ట్రస్టులో సభ్యుడు. శ్రీనివాసరావుకు ఇద్దరు సోదరీమణులున్నారు. ఒక సోదరి అప్పలకొండ బోని గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, సర్పంచ్ అప్పలకొండ భర్త సన్యాసినాయుడు బావమరిది అయిన కరకాల శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని తెలియడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలముకున్నాయి. శ్రీనివాసరావు భౌతికకాయాన్ని స్వంత నిరంకారీ ట్రస్ట్ సభ్యులు, పలువురు రాజకీయ నాయకులు సందర్శించారు.

నదిలో పడి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం ఉత్తరవాహిని నదీ తీరంలో ప్రమాదవశాత్తు కాలు జారిపడి 9వ తరగతి విద్యార్థి మరణించిన విషాద ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. తారక్ అనే విద్యార్థి ఉత్తరవాహిని ప్రాంతం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమానికి వెళ్లాడు. భోజనం చేసిన తర్వాత నదీ తీరానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారడంతో నదిలో పడి మరణించినట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరహానదిలో వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో పందూరు వరాహనది వద్ద ఆదివారం కాలిబాట వంతెన దాటుతూ వ్యక్తి గల్లంతయ్యాడు. స్థానికుల కథనం మేరకు.. గొట్టువాడ గ్రామానికి చెందిన సుంకర పెదపోతురాజు (65) పొలం పనుల నిమిత్తం సైకిల్ పై పందూరు వంతెన వద్ద నది దాటి వెళుతుండగా అదుపుతప్పి పడిపోయాడు. నదిలో జారిన వ్యక్తి ఒడ్డుకు చేరుకుని తిరిగి సైకిల్ కోసం నదిలోకి వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సైకిలు తీసుకొచ్చే క్రమంలో వ్యక్తి అలసిపోయి నదిలో మునిగిపోయి ఉండవచ్చునని స్థానికులు చెప్పారు. ఉదయం 7:30 ప్రాంతంలో జరిగిన ఘటన అనంతరం అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్యలు చేపట్టారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్నారు. సాయంత్రం వరకు ఆచూకీ దొరకలేదు.గల్లంతైన వ్యక్తికి భార్య సూర్యకాంతం, కుమార్తె రాజేశ్వరి, కుమారుడు వెంకటేష్ ఉన్నారు. వ్యవసాయ ఆధారిత కూలి కుటుంబం కావడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

బస్‌షెల్టర్‌ను కూల్చేసిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది వెంకటేశ్వర స్వామి ఆలయ ఆర్చ్ ఎదురుగా బిఎన్ రోడ్డు పక్కన ఉన్న బస్ షెల్టర్‌ను తొలగించి ఆ స్థలాన్ని చదును చేయించిన సయ్యపురెడ్డి భాస్కరరావు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.పంచాయతీ అనుమతి లేకుండా జెసిబితో బస్‌షెల్టర్‌ను కూల్చేయడమే కాకుండా, ఆ ప్రదేశాన్ని చదును చేసినట్లు పంచాయతీ కార్యదర్శి లోవరాజు ఫిర్యాదు చేశారన్నారు .కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సి ఈశ్వరరావు తెలిపారు.

వడ్డాది ఎస్‌సి కాలనీలో చోరీ

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలంలోని వడ్డాది గ్రామపంచాయతీ పరిధిలో ఎస్‌సి కాలనీకి చెందిన కోరుకొండ నాగరాజు ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి రూ.70 వేల నగదు, రెండు స్మార్ట్ ఫోన్లు చోరీ చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ఎసెన్షియా యాజమాన్యాన్ని అరెస్టు చేయాల్సిందే..

ప్రజాశక్తి - అచ్యుతాపురం, రాంబిల్లి

కార్మికుల మృతికి కారణమైన ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యాన్ని అరెస్టు చేసేంత వరకూ పోరాటం కొనసాగుతుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు స్పష్టం చేశారు. ఎసెన్షియా ఫార్మా ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబీకులను ఆదివారం ఆయన పరామర్శించారు. ఎస్ఇజెడ్ కాలనీ మోటూరు పాలెం గ్రామానికి చెందిన మృతుడు పూడి దుర్గాప్రసాద్ ఇంటికి నర్సింగరావు వెళ్లారు. అతని తల్లిదండ్రులు పూడి సన్యాసిరావు, శ్యామల, అన్నయ్య పూడి నానిబాబు, చెల్లి జ్యోతిలను పరామర్శించారు. అలాగే వాసెట్టిపాలెం గ్రామానికి చెందిన మృతుడు ఎల్లబెల్లి చిన్నారావు ఇంటికి వెళ్లి భార్య లోవమ్మ, పిల్లలు లక్ష్మి కోమలి, శశాంక, అన్నయ్య ప్రసాద్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాంబిల్లి మండలం మూలజంప గ్రామానికి చెందిన మృతుడు వేగి సన్యాసినాయుడు ఇంటికి వెళ్లి మృతుని భార్య అచ్చియ్యమ్మను, కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబీకులతో నర్సింగరావు మాట్లాడుతూ డబ్బు కన్నా ప్రాణం చాలా విలువైనదని అన్నారు. బాధిత కుటుంబీకులు మనోధైర్యంతో జీవనం సాగించాలని ధైర్యం చెప్పారు. పరిశ్రమల యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగానే కార్మికులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.

అచ్యుతాపురంలోని ఓ కళాశాల ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలోనూ నర్సింగరావు మాట్లాడారు. ఫార్మా కంపెనీలపై ప్రభుత్వాల ఉదాసీన వైఖరిని ఎండగట్టారు. సెజ్‌లు ఆధునిక జైళ్లుగా మారాయన్నారు. బ్రాండిక్స్‌లో సంవత్సరాలు తరబడి పనిచేస్తున్నా తక్కువ జీతాలే దక్కుతున్నాయని తెలిపారు. వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజాప్రతినిధులు హడావుడిగా వచ్చి వెళ్లిపోతున్నారు తప్ప శాశ్వత పరిష్కార మార్గాలు చూపడం లేదన్నారు. పరిశ్రమలకు కల్పించిన జిఒ నెంబర్ 62ను ఎత్తివేయాలని, సేఫ్టీ సోషల్ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిని ఖండిస్తూ ఈ నెల 28న జరిగే భారీ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గానికి సిఐటియు అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు నాయకులు కె.సోమునాయుడు, దేవుడునాయుడు, సెజ్ నిర్వాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు బుద్ధ రంగారావు, రాంబాబు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పర్యటనపై టిడిపి నేతల సమీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బుధవారం విశాఖ వస్తున్న నేపథ్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం టిడిపి నాయకులు సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ లోకేష్ వచ్చి వెళ్లే వరకు జరిగే కార్యక్రమాలను వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు.

హత్యాచార ఘటనపై నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కొల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ ప్రహ్లాదపురం వద్ద ఉన్న మోడీ స్టేట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిరసన ర్యాలీ చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినదించారు. ర్యాలీలో అసోసియేషన్‌లోని మహిళా సభ్యులంతా పాల్గొన్నారు.

కార్మికుల ప్రాణాలకు వెల !

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి



పరిశ్రమల ప్రమాదాలపై పాలకపక్షం, ప్రతిపక్షం స్పందిస్తున్న, మాట్లాడుతున్న తీరు ఆక్షేపణీయంగా వుంది. భవిష్యత్తులో ప్రమాదాలు నివారించాలన్న సదాలోచన ఏ మాత్రమూ కనబడ్డంలేదు. ప్రమాదం జరిగిన కంపెనీ ఆర్థిక పరిస్థితి, ప్రమాద సందర్భం, తీవ్రత ఆధారంగా పరిహారం పేరుతో మనిషి ప్రాణానికి వెల కట్టడం అదొక విలువగానూ, ధర్మంగానూ భావిస్తున్నాయి. ప్రమాదానికి కారణమైన యాజమానిపై చర్య తీసుకోవడానికి ఈ ప్రభుత్వాలకు ధైర్యం చాలకనో, తమవారిని నష్టపెట్టకూడదనోగానీ మనుషుల ప్రాణాలు బలితీసుకొనే యజమానులను తాకడానికి కూడా ఇష్టపడ్డంలేదు. న్యాయ సూత్రాల ప్రకారం మనిషిని చంపేవాడే కాదు.. చంపడానికి ప్రేరేపించే వాడు కూడా శిక్షార్హుడవుతాడు. పరిశ్రమల దగ్గరకొచ్చేసరికి ఈ మినహాయింపు యజమానులకు లభిస్తోంది. పొరపాటున జరిగిన ప్రమాదం కానప్పుడు, జాగ్రత్తలు తీసుకోక జరిగిన ప్రమాదమని స్పష్టంగా తెలిసినప్పుడు యజమానిని రక్షించాలనుకోవడం, వెనుకేసుకురావడం మనిషి, సమాజహితులెవరూ చేయరు. సమర్థించరు.

అసెన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో 17 మంది మృతికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని కార్మిక, ప్రజా సంఘాలో, నిపుణులో చెప్పడంలేదు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తరువాత జరిగిన మీడియా సమావేశంలో యాజమాన్యం నిర్లక్ష్యంతో ఈ ప్రమాదం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. అయినా యాజమాన్యంపై చర్య తీసుకుంటారా ? అంటే ఉన్నత స్థాయి కమిటీని నియమించి, ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తప్పించుకున్నారు. 17 మంది ఉద్యోగులు, కార్మికులను బలితీసుకున్న యజమాని పట్ల ముఖ్యమంత్రి ఇంత ఉదారంగా వుంటే, కార్మికులు, ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా ఎక్కడ వుంటుంది ?. నాడు ఎల్‌జి పాలిమర్స్ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇచ్చామని చెబుతున్న జగన్మోహన్‌రెడ్డి, నేడు అసెన్షియా ఫార్మా మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు పరిహారం ఇప్పించామని చెప్పుకుంటున్న చంద్రబాబు మాటల్లో ప్రమాద నివారణకు తీసుకోబోయే చర్యలు, భద్రత పాటించని యజమానులకు ప్రభుత్వపరంగా విధించబోయే శిక్షల గురించి ఎక్కడా కానరావడం లేదు.

కార్మికుల భద్రతపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు చంద్రబాబు మీడియా సమావేశంలో బదులిస్తూ పెట్టుబడులు, ఉపాధి, భద్రతకు సమ ప్రాధాన్యత ఇస్తామని బోధించారు. సిఎం మాటల్లో ఎవరికైనా ఒక ప్రశ్న ఉదయిస్తుంది. కార్మికుల ప్రాణాలకు భద్రతలేని పెట్టుబడులు, ఉపాధి ఎందుకు ?. హక్కుల కోణం నుంచి మాట్లాడితే మనిషికి జీవించే హక్కు, అవకాశం, భద్రత పరిశ్రమల్లో లేనప్పుడు పెట్టుబడులు ఎవరి కోసం ?. పనిచేసే ప్రదేశం, ప్రాంతంలో మనిషి బతకడానికి తొలుత భరోసా ఇవ్వాలన్న ఇంకితం కూడా ప్రభుత్వాలకు లేకపోవడం బాధాకరం. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ మానవ తప్పిదం వల్ల జరిగిందని తన (యజమానుల) తప్పిదాన్ని కప్పిపుచ్చుకొని కార్మికులపై నెట్టే ప్రయత్నం అటు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం చేస్తూ వస్తున్నాయి. అసెన్షియా ప్రమాదంలోనూ, దీని తరువాత పరవాడ ఫార్మాలోని సినర్జిన్ కంపెనీలో జరిగిన ప్రమాదంలోనూ ఆ మానవ తప్పిదం యాజమానులదేనని తేటతెల్లమైంది. ఎటువైపు నుంచి చూసినా ప్రతి ప్రమాదానికి యాజమాని భద్రతా వైఫల్యమో, తక్కువ జీతాలకు నైపుణ్యంలేని కార్మికులను పెట్టుకొని పనిచేయించడమో, రక్షణ పరికరాలు కార్మికులు, ఉద్యోగులకు ఇవ్వకపోవడమో, కంపెనీ డిజైన్‌లోనే లోపాలు ఉండడమో బయటపడుతూనే ఉన్నాయి.

వాటిని సరిచేసే ప్రయత్నం ప్రభుత్వం నుంచి పటిష్టంగా లేకపోవడంతో ప్రమాదాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదాలు తగ్గాలంటే ప్రతి కంపెనీ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి. ఆడిట్ నివేదికలోని అంశాలను నోటీసు బోర్డులో కార్మికులు, ఉద్యోగులందరికీ అర్థమయ్యే భాషల్లో ప్రదర్శించాలి. లోపాలను సరిచేయించే, సరిచేయకపోతే చర్యతీసుకొనే అధికారం సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఇవ్వాలి.

ఉమ్మడి విశాఖలో 11 ఫ్లై ఓవర్‌లు

'ప్రజాశక్తి'తో వియంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఉమ్మడి విశాఖ జిల్లాలోని విశాఖ, అనకాపల్లిల్లో 11 ఫ్లై ఓవర్‌లకు ప్రతిపాదనలను సిద్ధం చేయగా వాటికి కేంద్రం ఆమోదముద్ర వేసిందని వియంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ తెలిపారు. సుమారు రూ.1800 కోట్లతో ఈ ఫ్లై ఓవర్‌ల నిర్మాణం చేపట్టనున్నట్టు వెల్లడించారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన పలు విషయాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఫ్లై ఓవర్‌ల ప్రతిపాదనల గురించి తెలపండి ?

పరదేశిపాలెం నుంచి గాజువాక వరకూ 10 ఫ్లై ఓవర్లను, అనకాపల్లి పరిధిలో ఒక ఫ్లైఓవర్‌ను వేసేందుకు ప్రణాళిక రచించాం. కేంద్ర ప్రభుత్వం వీటికి ఇటీవలే ఆమోదం తెలిపింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ) అధికారులు దీనిపై అధ్యయనం చేస్తున్నారు. త్వరలో కార్యరూపం దాల్చనున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం ఫ్లై ఓవర్‌లపై ఎలాంటి విధానం తీసుకోనుంది?

ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖ మెడ్‌టెక్ జోన్‌కు విచ్చేసిన సందర్భంగా ఎయిర్ పోర్టు లాంజ్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై మార్గనిర్దేశం చేశారు. సిఎం ఆలోచన చూస్తే పై ఫ్లై ఓవర్‌లన్నిటినీ కలిపి ఒకే ఫ్లై ఓవర్‌గా విశాఖ నగరం వరకూ తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఫ్లై ఓవర్ పరిధిలోకి వచ్చే వివిధ ప్రధాన జంక్షన్ల వద్ద సర్వీసు రోడ్లు వచ్చేలా డిజైన్‌ను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

11 ఫ్లై ఓవర్‌లు లేదా అన్నీ కలిపి ఒకే ఫ్లై ఓవర్‌లా తెచ్చేందుకు ప్రాజెక్టు ఖర్చు ఎంత ఉంటుందని అంచనా వేస్తున్నారు?

సుమారు రూ.1800 కోట్లు అయ్యే అవకాశాలున్నాయి. జాతీయ రహదారి సంస్థతో కలసి వియంఆర్‌డిఎ కొంత మేర డిపిఆర్‌ను తయారు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ఒక విధానం ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇంకా వియంఆర్‌డిఎ ఏయే కీలక ప్రాజెక్టులను చేపట్టబోతోంది ?

గడిచిన కొంత కాలంగా నడుస్తున్న పలు ప్రాజెక్టులు ముందుకు సాగనున్నాయి. ఏ ప్రాజెక్టూ ఆగే పరిస్థితి లేదు. కొత్తగా కైలాసగిరిపై బిర్లా ప్లానటోరియం ఏర్పాటు చేయనున్నాం.



వినసొంపుగా సాగుతున్న కచేరి

అలరించిన మీటా పండిట్ సంగీత కచేరి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ మ్యూజికల్ అండ్ డ్యాన్స్ అకాడమీ (కళాభారతి) వార్షికోత్సవ వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. ఆరు రోజులపాటు జరిగే ఈ సంగీత వార్షిక ఉత్సవాల్లో రెండో రోజైన ఆదివారం ప్రదర్శించిన సంగీత కచేరి అలరించింది. హిందుస్థానీ గాత్ర సంగీత కచేరీలో దేశంలో ప్రసిద్ధిగాంచిన విధ్వంసురాలు మీటా పండిట్ తన శ్రావ్యమైన కచేరీతో శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. రెండో రోజు కార్యక్రమాలను విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబ్రాత బాగ్చి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలకు నిలయమైన విశాఖపట్నంలో కళాభారతి వేదికగా ఇటువంటి కార్యక్రమాలు జరగడం అభినందనీయమన్నారు. కళాభారతి యాజమాన్యం కళలను చేస్తున్న సేవ అద్భుతమని కొనియాడారు. కళలకు రాజధాని.. విశాఖ అని ప్రశంసించారు. కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

28న భూ బాధితుల సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భూకబ్జాదారుల కోరల్లో చిక్కుకున్న ప్రభుత్వ భూముల లావాదేవీలన్నింటినీ రద్దు చెయ్యాలని, పేద ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో ఈ నెల 28న సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించే భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చెయ్యాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, జిఎస్‌జె.అచ్యుతరావు, ఎస్‌కె.రెహమాన్, సిఎన్.క్షేత్రపాల్, పి.చంద్రశేఖర్, జి.రాంబాబు, ఎన్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి కూటమి ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఆ వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. 26 జిల్లాల పరిధిలో దాదాపు 2 లక్షలా 40 వేల మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఆ రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఏడాదిగా నిలిచి పోయిందన్నారు. కొత్తగా వివాహమైన వారికి వివాహ ధ్రువపత్రం చూపిస్తే కార్డులు ఇస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రకటించినా ఉత్తర్వులు ఇంకా వెలువడలేదన్నారు. గత ఏడాది జూలై వరకు దరఖాస్తు ప్రక్రియ జరిగిందని, ఆ తరువాత ఆగి పోయిందని అన్నారు. కార్డుల్లో పేర్లు తదితర మార్పులకు అవకాశం ఇవ్వలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులకు అవకాశం ఉన్నంత మేరకు రేషన్ సరుకులను వారి చెంతకు చేర్చాలని కోరారు.

అంత్యక్రియలకు వాసుపల్లి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జైన్ చౌట్రి మాజీ చైర్మన్, జిల్లా ఎస్‌సి సెల్ జనరల్ సెక్రటరీ కుందేటి సుధాకర్ తండ్రి కుందేటి మోహనరావు ఆదివారం అకాల మరణం చెందడంతో ఆయన అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. మోహనరావు మృతి విషయం తెలుసుకున్న వెంటనే గణేష్ కుమార్ రంగిరీజు వీధిలో అంత్యక్రియలకు హాజరయ్యారు. మోహనరావు భౌతికకాయం వద్ద నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం నింపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మాసి పోగురాజు పాల్గొన్నారు.